


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### అబద్ధం

**మా సందానీగాడి** తమ్ముడు ఎప్పుడూ అబద్ధాలు చెప్పలేదుట. నేను ఆశ్చర్యపోయి చూసాను. అప్పుడు మేము ఐదో తరగతి చదువుతున్నాం. నా ఆశ్చర్యం చూసి, సందానీ కుడిచెయ్యి వెనక్కి తిప్పి మూతికి అడ్డంగా పెట్టుకుని పకాపకా నవ్వి "వాడు ఇస్కూల్ జాయిన్ కాలే.. ఎట్ల అబద్ధాలు చెప్తయ్?" అన్నాడు.

నిజమే ఏ బాలుడికైనా బాలికకైనా అబద్ధాలు చెప్పడం, అక్షరాభ్యాసం అయి స్కూల్‌కి వెళితే కానీ ప్రారంభం కాదు. ఇది ఘంటాపథంగా చెప్పగలను.

"నేను కడుపునెప్పితో బాధపడుచున్నాను. దయచేసి శలవు మంజూరు చేయప్రార్థన" అని తెలుగులో "I am suffering with stomach ache" అని ఇంగ్లీషులో లెటర్స్ రాసినప్పుడు అది అబద్ధం, ఇంట్లో లడ్డూలు చెయ్యడమో.. దగ్గర్లో వున్న సినీమాహాల్లో సినిమా మారడమో కారణం అని టీచర్‌కీ తెలుసు.

ఇలా `కడుపు నెప్పి లేదా జ్వరం` లీవ్ లెటర్స్‌తో గుంభనంగా సాఫీగా బతుకుసాగిస్తుంటే, మొదటిసారి సందానీ లీవ్ లెటర్లో ఓ సంచలనం సృష్టించాడు. అది బంధువులని చంపడం ద్వారా.

"నాదీ నాయనకీ రెండో అక్క మర్‌గయా!" అని వాడు వంకర టింకర అక్షరాలతో రాసి టీచర్‌కి ఇచ్చాడు.

"నిజంగా మీ అత్త చచ్చిపోయిందా?" రాణీ టీచర్ నిలదీసింది. వాడు గొల్లు గొల్లుమని కిందపడి చేతులూ కాళ్ళూ తన్నుకుంటూ ఏడ్చాడు.

"సర్లే.. వెళ్ళు" అంది రాణీ టీచర్. ఆ తర్వాత వాడు "నాకీ నాయనకీ అక్క మర్‌గయా" అని మళ్ళీ రెండు రోజులకి రాసాడు. "పోయినవారం ఇదే రాసావుగా?" టీచర్ కోపంగా అడిగింది. "నాకీ నాయనకీ ఎనిమిది అక్కలున్నాయి" చెప్పాడు.

నాకా సౌలభ్యం లేదు " మా అత్త చనిపోవడం వలన బడికి రాలేకపోతున్నాను" అని నేను లీవ్ లెటర్ రాసి టీచర్‌కిస్తే, ఆ రోజు సాయంత్రమే రాణీ టీచర్‌కి బస్‌లో పక్క సీట్లో మా అత్త కనిపించి "మా తమ్ముడి కూతురు.. మీ క్లాసే. దాని పేరు ఫలానా బాగా చదువుతోందా?" అని అడిగిందట. మరునాడు నాకు `వేపా వారి అబ్బాయితో పెళ్ళి`

అసలు స్కూల్‌కి వెళ్ళకపోతే ఈ అబద్ధాల లీవ్ లెటర్ల గోలే వుండదుగా. అందుకే అబద్ధాలకీ అక్షరాభ్యాసానికి దగ్గర సంబంధంవుంది.

"మాకీ అత్త ఇంట్లో పెద్ద ఆల్‌సేషన్ డాగ్ వున్నాయ్" అని సందానీ చెప్తే, "మా అత్త ఇంట్లో పెద్దపులికి చైన్ కట్టి పెంచుతారు" అని ఇంకోడు క్లాసులో చెప్పాల్సిందే.

మా ఇంటికి ఓ సారి శలవుల్లో మా పిన్ని కొడుకొచ్చాడు. వాడు హాస్టల్లో వుండేవాడు. హాస్టల్ అంటే తెలీని మేము రకరకాల ప్రశ్నలు వేసాం. "భోజనం ఎలా వుంటుంది? గార్డెన్ వుంటుందా? ఆటలు ఏం ఆడ్తారూ?" లాంటివి.

వాడు "మా దగ్గర ఓ గుఱ్ఱం వుంటుంది. అది కొయ్యగుఱ్ఱం. ఓసారి కీ ఇచ్చి దాని మీదకి ఎక్కితే రెక్కలు విప్పుకుని ఓ మైలు ఆకాశంలో ఎగుర్తుంది. దాని చెవులు పట్టుకుని ఎటు అంటే అటు డైరెక్షన్ తిప్పుకోవచ్చు" అని చెప్పాడు.

అవన్నీ వాడు కోస్తున్నాడు అని తెలీక మేం నోరు తెరుచుకుని విన్నాం. అప్పటికప్పుడు రెండు గౌన్లు సంచీలో కుక్కేసాను. వాడి వెంట రెక్కల గుఱ్ఱం మీద ఊరేగడానికి.

ఇంతలో సందానీగాడొచ్చాడు, వాడికీ ఈ రెక్కల గుఱ్ఱం విషయం చెప్పాను.

"మా ఊర్లో ఒక చెరువు వుంది. అందులో ఒక ఆమె వుంది. చూడనీకి ఎ.వీ రమణి లెక్క వుంటయ్. కానీ కింద చేప నేను 'మీనూ' అని పిలిస్తే వురికి వురికి వస్తయ్" అన్నాడు.

సగం అమ్మాయీ సగం చేపా ఒక అద్భుత ప్రపంచంలోకి తీసుకెళ్ళాడు.

"సందానీగాడితో వెళ్దాం. ఎటూ సంచి సర్దుకున్నాం కదా!" అనుకున్నాను.

"రేపు స్కూల్ అయినంక మీకీ అమ్మ పర్సులకెల్లి చారానా తీస్కరా. మా వూరు పోదాం" అన్నాడు.

నేను ఆ రోజు కడుపు నెప్పి అని అబద్ధం ఆడి అన్నం మానేసా! ఎందుకంటే అమ్మ పర్సులోంచి పావలా తియ్యడానికి. తీరా చెయ్యిపెట్టి గబుక్కున దొరికిన బిళ్ళ తీసా. అది అర్ధరూపాయి. సందానీ పావలానే తియ్యమన్నాడుగా. నేను మళ్ళీ అర్ధరూపాయి వేసేసి పావలా తియ్యడానికి అమ్మ పర్సులో చెయ్యి పెట్టా. అప్పుడే మా అమ్మమ్మ చూసేసింది. ఆ తరువాత నాకు బడిత పూజ మామూలే. అసలు అర్ధరూపాయి తీసేస్తే రోగం కుదిరేది. నిజాయితీకి పోతే దెబ్బలు. ఈ పెద్దాళ్ళింతే అనుకున్నా.

మరునాడు సందానీతో స్కూల్ తర్వాత వాళ్ళ వూరు వెళ్ళే ప్రయత్నంలో వుండగా, మా పిన్ని కొడుకు రాంబాబు గాడికీ సందానీకీ పెద్ద గొడవైపోయింది.

"ఏంరా.. ఫేకోమత్. నాకీ బడిలో రెక్కల గుఱ్ఱం వున్నాయా? నీకీ చొక్కాకీ బటన్లు బీ లేవు" అని సందానీ అన్నాడు.

"మీ చెరువులో సగం అమ్మాయీ, సగం చేపా వున్నాయీ? అది చూపించడానికి ఈ పిచ్చిదాన్ని తీసుకెళ్తావా?" రాంబాబు అడిగాడు.

"మాకీ చెరువులో చేపపిల్లలు నాలుగు వున్నయ్. మూడిటిని పోయినసారి శలవుల్లో మా అత్త కూర వండేసింది. ఇంకా ఒకటి వున్నాయ్" అన్నాడు.

"నువ్వు అబద్ధాలు చెప్తున్నావు"

"నీకీ అన్నీ నిజాలే చెప్తాయా?"

"నీకీ మాకీ ఏంట్రా? సరిగ్గా మాట్లాడు"

"'మా'కీ అంటావురా. బద్మాష్ "అని ఇద్దరు ఒకర్నొకరు కొట్టుకుంటూ, బురదలో పొర్లుతుంటే, చూసి నేను వెళ్ళి సరోజిని అమ్మమ్మని పిలుచుకొచ్చా. ఈ రాంబాబు గాడు ఆవిడ స్వంత మనవడు.

సరోజిని అమ్మమ్మ వాడి వీపు మీద మళ్ళీ నడ్డి విరిచేసి, ఇంటికి తీసుకొచ్చింది.

సందానీ వూరు ప్రయాణం వాయిదా పడింది.

ఆరుబయట వెన్నెల్లో నవారు మంచాలు వాల్చి, పరుపులు వేసుకుని పడుకున్నాకా, సరోజని పిన్ని రాంబాబుగాడికీ సందానీకీ గొడవ ఎందుకైంది అని అడిగితే రాంబాబు బళ్ళో 'రెక్కల గుర్రం', సందానీ వూళ్ళో 'సగం చేప పిల్ల' గురించి చెప్పి "అమ్మమ్మా నన్ను రెక్కల గుర్రం ఎక్కించమనవా? ఎంతో దూరం వద్దు. జస్ట్ చార్మినార్ దాకా వెళ్ళేసొస్తా" అన్నా.

దానికి ఆవిడ "రెక్కల గుర్రమా? ఈ అబద్ధాల కోరు వెధవ చెప్పాడా?" అని ముక్కూ మూతీ ఏకం అయ్యేట్టు పడిపడి నవ్వింది.

సందానీ శలవు కోసం బంధువులని 'చంపచ్చు' అని మా అందరికీ తెలియబరిచాక మేం, మా ఇష్టం వచ్చినట్లు బాబాయ్‌లనీ, మావయ్యలనీ, పెద్దమ్మలనీ, తెగ చంపాం. ముఖ్యంగా తాతయ్యలని చంపేసేవాళ్ళం. టీచర్ ఈజీగా నమ్మేసేది. ఓసారి మా రాణీ టీచర్

"మీ నాన్నగారు పోయి రెండురోజులు కాలేదు. అప్పుడే సినిమా కొచ్చారా?" అని మా రమాదేవి తల్లిని బాలాజీ టాకీస్‌లో అడిగితే ఆవిడ "మా నాన్నగారు పోయారా? మొన్నే కాకినాడ నుండి కాజాలు కూడా పంపించారే" అని కంగారు పడిపోయిందిట.

అలాగే ఫీజు కట్టని వాళ్ళని క్లాసులో నిలబెట్టి "ఎందుకు కట్టలేదు?" అని అడిగితే "మాకీ నాయినా వూరికి పోయింది" అని సందానీ తడుముకోకుండా చెప్పేవాడు.

వాళ్ళ నాన్న ఆర్.టీ.సీ బస్సు డ్రైవర్ రోజూ వూరికి పోతాడు. నేనూ వాడ్ని చూసి "మా నాన్న వూరికెళ్ళారు" అంటే "అయితే మీ అమ్మని పిలుచుకురా" అంది టీచర్.

సందానీ మాత్రం ఫీజు కట్టకపోతే క్లాసులోంచి బయటకి పంపేస్తే, కుషీగా మావిడి చెట్లు ఎక్కి పిందెలు కోస్తూ, దిగుడు బావిలో ఈదుతూ కులాసాగా వుండేవాడు. మా అమ్మమ్మ పుట్టి మునిగి పోయినట్లు నాలుగు నెలలకీ కలిపి 'ఇరవైరూపాయిలు' ఒకేసారి కట్టేసేది. దాంతో నాకు ఒళ్ళు మండేది. అసలు బళ్ళో అలా అరిగిపోయేదాకా బెంచీల మీద కూర్చోడం నాకు అసహ్యం.

స్కూల్లో అబద్ధాలు నేర్చుకున్నాకా, కొన్ని చోట్ల తల్లి తండ్రులు కూడా నేర్పేవారు.

"రైల్లో టీ.సీ వచ్చినప్పుడు నీకెన్నేళ్ళు పాపా? అంటే మూడు అను" ఇలాగా!

హోం వర్క్ కూడా ఎందుకో బోలెడు ఇచ్చేవారు. నేను భవానికి రేగుపండ్లు కొనిపెట్టి కొన్నిసార్లు చేయించేసేదాన్ని. చెయ్యకపోతే "మా అమ్మమ్మని ఆస్పత్రిలో చేర్చారు. అందుకే చెయ్యలేదు" అని చెప్పేదాన్ని. ఇదీ సందానీగాడు నేర్పించినదే

అలా నేను చెప్పినరోజే ఈ అమ్మమ్మ ఇత్తడిగ్లాసులో కాఫీ పుచ్చుకుని, పైన కొంగు కప్పి "మా పిల్ల ఏవీ తినకుండా స్కూల్ కొచ్చింది.. ఈ కాఫీ తాగించి వెళ్తా" అని వచ్చింది. దాంతో రాణీ టీచర్ ఆవిడకి నిజాలు చెప్పేయడం ఆవిడ నడ్డిమీద చంపేయడం.

అసలు పెద్దాళ్ళు మాత్రం అబద్ధాలు ఆడరా? మా పారిజాతం అత్తయ్య "వదినా.. ఓ చెంచాడు కాఫీపొడి పెడ్తావా? ఈ కుమారీ వాళ్ళ నాన్న వూరునుండి వచ్చాక తెప్పించి ఇస్తా" అని పెద్ద గ్లాసు పట్టుకుని అప్పుకొచ్చేది. కుమారి నాన్న వీధి వరండాలో పేపర్ చదువుతూ కనిపిస్తుండేవాడు.

మా బామ్మ 'టీకా'లు వేసేవాళ్ళు ఎవరొచ్చినా "మా పిల్లలు ఇంట్లో లేరని మా నాన్నని దాచేసి ఎప్పుడూ వేక్సినేషన్ వేయించనే లేదుట.

మా అమ్మమ్మ స్టీలు సామాన్లు, పాతబట్టలకి ఇచ్చే అమ్మితో "ఇంక నా వంటి మీద చీర తప్పలేదు. ఇది కూడా విప్పి ఇచ్చెయ్యనా? అప్పుడిస్తావా ఈ చిన్న డబ్బా?" అనేది.

మా అత్తయ్యా, మావయ్య జేబులోంచి డబ్బులు కొట్టేసి, చీటీలు కట్టి "మా అమలాపురం పిన్ని చేయించింది వేలికి మెలికుంగరం" అని పెట్టుకునొచ్చేది. ఈ విషయం పెద్దాళ్ళు మాట్లాడుకుంటుంటేనే తెలిసేది.

సినిమా పత్రికల్లో హీరోయిన్లు అంతా "డాక్టర్లు కాబోయి ఏక్టర్లు అయ్యాం" అనే చెప్పేవారు. ఎవరూ హైస్కూల్ దాటిన మొహాలు కావు అప్పట్లో.

మా ఫ్రెండ్ ఒకత్తి "మా ఇంట్లో బోలెడు ఆవులు.. ఎప్పుడూ జున్ను వుంటుంది. పాలు ఏం చేసుకోవాలో తెలీడంలేదు" అని చెప్పేది. ఓ రోజు వాళ్ళ ఇంటికి వెళితే వాళ్ళ ఇంట్లో ఆవులు కాదు. వీళ్ళే ఆవులు.. ఇంట్లో అంటే గొడ్ల చావిడిలో వున్నారు ఇంటివాళ్ళ దయవల్ల.

అసలు స్కూల్లో అబద్ధాలు ఆడడం అనే కళ అనర్గళంగా వచ్చేసేది, పెద్దయ్యాకా కష్టపడకుండా.

అమాయకంగా ఎవరే అబద్ధాలు చెప్పినా నమ్మేసేవాళ్ళం. అయినా ఆ చిన్నప్పటి రోజులే బావుండేవి.

సడెన్‌గా అర్ధరాత్రుళ్ళు ఒక్కోసారి కుదిపి కుదిపి లేపేసి "కాస్త జరిగి పడుకో నాన్నా "అని ఏ సుబ్బిగాడినో పక్కన పడుకోపెట్టేవాళ్ళు. వాడు ఇనపగొళ్ళేల్లా కాళ్ళూ చేతులూ మన మెడకేసి తెల్లార్లూ చంపేవాడు. తెల్లారి లేచాక తెలిసేది. వాడు వరుసకి పెద్దమ్మ అయ్యే గాజువాక పేరమ్మ కొడుకని. ఎవరైతేనేం వాడు వున్నన్నాళ్ళూ హాల్లో కింద వరుసగా పిల్లలకి చాపలూ, వాటిమీద బొంతలూ వేసి పక్క పక్కన పడుకోపెట్టేవాళ్ళు? కొందరు బొంతలు తడిపేసేవారు. అసలు చుట్టాలు మా జీవితాల్లో భాగం అయివుండేవారు. ఈ నెల చుట్టాలు రాలేదూ అంటే విచిత్రం. తెల్లవారు ఝామున కుంపటి దగ్గర కాఫీలు తాగుతూ పెద్ద గొంతుకులతో "అక్కయ్యా. నీ కోసం పేటేరు చీరలు పట్టుకొచ్చా" అని మాట్లాడుకుంటూ వుంటే "మళ్ళీ చుట్టాలొచ్చారు. అని వరుస కనుక్కునే దాన్ని. అమ్మకి పిన్ని. అంటే నాకు అమ్మమ్మ. అంతే బడికి ఆ రోజు "అనుకోకుండా మా అమ్మన్నక్కయ్య అను అమ్మమ్మ చనిపోవడం వలన స్కూల్‌కి రాలేకపోతున్నాను. శలవు మంజూరు చేయప్రార్ధన" అని ఉత్తరం రాసేదాన్ని.

సందానీ ఇంకా వింతవింతగా రాసేవాడు "మాకీ నాయనకీ సైకిల్ కింద మాకీ బక్రీ పడి, నాయిన మూడు కాళ్ళూ, బక్రీ ఒక కాలూ విరిగినయ్!" అని.

కొందరు మంచి చుట్టాలు మా కోసం బందరులడ్డూలూ, నల్ల హల్వా, కారం పూసా, చక్కెరకేళీలూలాంటివి తెచ్చేవారు. వాళ్ళమీద శలవు చీటీలు రాసేదాన్ని కాదు. ఇష్టంలేని చుట్టాల మీదే ఎక్కువగా శలవు చీటీలు రాసేదాన్ని.

నేను అమ్మ అయ్యాక మా పిల్లలు కూడా అలాగే రాస్తారని నాకు అనుమానంగా వుండేది. అప్పుడప్పుడూ స్కూల్లో టీచర్స్‌ని లీవ్ లెటర్స్ ఏవైనా వచ్చాయా ఈ నెల? అని అడిగేదాన్ని.

నేను టీచర్ అయ్యాకా ఎవరి లీవ్ లెటరూ వచ్చినా నమ్మేదాన్ని కాదు. కానీ వాళ్ళ మొహాల్లో మా సందానీగాడు కనిపించి తెగ నవ్వొచ్చేది. కాయితపు పడవలూ అగ్గిపెట్టె టెలిఫోన్లూ, మిఠాయి డబ్బా ఖాళీ అయ్యాకా వాటికి దారం కట్టి 'కారు' ఆటలూ.. కారు చౌకగా ఆడుకునేవాళ్ళం.

ఇప్పుడు ఇరవై వేలు పోసి పిల్లలకి రిమోట్‌తో నడిచే కారు బొమ్మలు కొనేస్తున్నారు. మా పిల్లలు అప్పట్లో జాతరలో లక్క పిడతల సెట్టుకోసం ఓ పూటంతా గొంతెత్తి ఏడ్చి పేచీ పెడితే, రూపాయి పెట్టి కొనేవారు.

ఇప్పుడు పిల్లలు అచ్చంగా పాడు చెయ్యడానికే ఐ పేడ్‌లూ.. సెల్‌ఫోన్లూ కొని చేతికిస్తున్నారు. వాడికి రెండేళ్ళు వచ్చేసరికే వాటి ఆపరేషన్ తెలిసిపోతుంది. చూసి అవతలకి గిరాటేస్తాడు. అది రెండు ముక్కలౌతుంది.

నిన్న మా మేనల్లుడి కొడుకు. ఇంకా మాటలు సరిగ్గా రావు. కెమేరా తెచ్చి ఇచ్చి "ఓపెన్...ఓపెన్" అన్నాడు.

"బ్యాటరీలు లేవు" అంది వాళ్ళమ్మ. చటుక్కున వెళ్ళి, మా ఇంట్లో నాకే తెలీని చోటు నుండి బ్యాటరీలు తెచ్చాడు.

"చార్జింగ్ లేదు" అంది.

వెళ్ళి ఇంట్లో వున్న కేబుల్స్ అన్నీ తెచ్చాడు.

"కరెంట్ లేదు అనకే బాబూ! వెళ్ళి ట్రాన్స్‌ఫార్మర్ తెచ్చేస్తాడు" అన్నాను.

అంతంత తెలివితేటలు ఈ కాలం వాళ్ళకి.

అబద్ధం ఆడడం నేర్చుకోడానికి "అమ్మ కడుపు చాలు" స్కూల్‌కి వెళ్ళక్కర్లేదు.

Post your comments

